సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఉచిత విద్యుత్ అందేనా..

సింగరేణి ఇండస్ట్రియల్ విద్యుత్ ను వినియోగిస్తున్న 21 పిట్ ఏరియా కార్మి కులకు ప్రభుత్వ ఉచిత విద్యుత్ అందేలా లేదు. 8లో



క్రికెట్ టోర్నీలో ప్రతిభ

అశ్వాపురంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నీలో పాల్వంచ కేటీపీఎస్ జట్టు ఘన విజయం సాధించింది. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐడీఓసీని సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గార్డెన్ అండ్ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్–2024 సందర్భంగా స్థానిక ఐడీఓసీని రాష్ట్ర పరిశీలకులు కె.కిషన్‌రావు, కె.వి. ప్రవీణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి మొదటి వారంలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఐడీఓసీల్లో పచ్చదనం పెంపకానికి చేపట్టిన చర్యలను ప్రామాణికంగా తీసుకుంటామని, రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఉత్తమ ఐడీఓసీలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇళ్లలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు టెర్రస్ గార్డెన్ ఏర్పాటుపై పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్లు, పాపప్స్ వంటి అధునాతన పరికరాలు ఉపయోగించి పచ్చదనం పెంపొందించేందుకు కలెక్టర్ ప్రియాంక ఆల పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారని అభినందించారు. కార్యాలయ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటే ఉద్యోగుల పనితీరు కూడా మెరుగుపడుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా అగ్రస్థానంలో ఉండడంతో పాటు ఐడీఓసీలో పచ్చదనంలో కూడా అగ్రగామిగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, కార్యాలయ అధికారి సముద్రాల విజయ్‌కుమార్, కేర్ టేకర్ కృష్ణప్రసాద్, గార్డెన్ సూపర్‌వైజర్ అశోక్, గార్డెనర్స్ కృష్ణయ్య, నరసింహారావు, తిరుపతి పాల్గొన్నారు.

అదనపు డీఆర్డీఓ జయశ్రీ బదిలీ

చుంచుపల్లి: ఇటీవల ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అదనపు డీఆర్డీఓ(సెర్ప్) ఆర్.జయశ్రీని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు వచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఒకే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల బదిలీల్లో భాగంగా వచ్చిన ఉద్యోగులకు మళ్లీ స్థానచలనం కల్పిస్తున్న క్రమంలో జయశ్రీని మహబూబాబాద్ జిల్లాకు పంపారు.

ఇదేం దా'రుణం'?

అన్నదాతలకు ఇక అప్పు కష్టమే..

- నిరర్థక ఖాతాదారులుగా రైతులు
- ఎన్‌పీఏలోకి జిల్లాలోని 44వేల మంది ఖాతాలు
- రుణాల చెల్లింపు గడువు దాటడంతో బ్యాంకర్ల చర్యలు

బూర్గంపాడు: రుణమాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. పంటల సాగుకు తీసుకున్న రుణాలు వడ్డీతో కలిపి తడిసి మోపెడయ్యాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా చేస్తుందని రైతులు ఆశిస్తే ఆ దిశగా కూడా అడుగులు పడడం లేదు. ఇక రైతులు తీసుకున్న పంట రుణాలు నిర్దేశిత గడువులో తిరిగి చెల్లించనందున బ్యాంకర్లు నిరర్థక ఖాతాలుగా మార్చేస్తున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు, వడ్డీ చెల్లించనందున రైతుల ఖాతాలను ఎన్‌పీఏ(నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్స్)గా గుర్తించి బ్యాంకు లావాదేవీలను స్తంభింపజేస్తున్నారు. ఈ ఖాతాలు ఎన్‌పీఏలోకి వెళితే దాని ప్రభావం సిబిల్ స్కోర్‌పై పడుతుంది. దీంతో భవిష్యత్‌లో ఎలాంటి రుణాలనూ పొందే వీలుండదు. పంట రుణాల కోసం రైతులు బ్యాంకుల్లో పూచీకత్తుగా పెట్టిన ఆస్తులను జప్తు చేసుకునే జాబితాలోకి ఎన్‌పీఏ రైతులను చేరుస్తున్నారు. ఇవన్నీ అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఏటా చెల్లించాల్సిందే..

పంటల సాగుకు తీసుకున్న రుణాలను రైతులు ప్రతీ సంవత్సరం చెల్లించాలని బ్యాంకులు విధించిన నిబంధనల్లో ఉంది. పంట చేతికందిన తర్వాత రుణం చెల్లిస్తే బ్యాంకర్లు తిరిగి కొత్తగా పంటరుణాలు ఇస్తారు. ఒకవేళ పంటలు పండకుంటే వడ్డీ చెల్లిస్తే రుణాలను రీ షెడ్యూల్ చేస్తారు. అలా చేసినా వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పంట రుణాలపై బ్యాంకులు రైతుల నుంచి ఏడు శాతం వడ్డీ వసూలు చేస్తాయి. అప్పు ఖాతాల నిర్వహణ సక్రమంగా జరుగుతుంటే ప్రభుత్వం మూడు శాతం రాయితీ ఇస్తుంది. దీంతో రైతులకు నాలుగు శాతం వడ్డీకే పంట రుణాలు అందుతాయి. అయితే రుణమాఫీ ఆశతో రైతలు నాలుగైదేళ్లుగా రుణాలు చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ కలిపి మొత్తం అప్పుగా చూపడంతో అసలు కంటే వడ్డీ ఎక్కువ కావడం గమనార్హం. దీంతో ఇటు వడ్డీ రాయితీ రాక, అటు రుణపరిమితి మించిపోవడంతో బ్యాంకర్లు కనీసం వడ్డీ అయినా చెల్లించి రుణాన్ని రీ షెడ్యూల్ చేసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రుణాలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. బ్యాంకు ఖాతా ఎన్‌పీఏలోకి చేరినా, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకున్న సిబిల్ స్కోర్ పూర్తిగా తగ్గిపోయి భవిష్యత్‌లో ఎలాంటి బ్యాంకు రుణాలకు అర్హులు కాకుండాపోతారు. ఏదైనా వాహనం, వస్తువు కొన్నప్పుడు ప్రైవేటు ఫైనాన్స్‌లో అప్పు తీసుకునే అవకాశాలు కూడా కోల్పోతారు.



బూర్గంపాడు మండలంలో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

రుణమాఫీపై హామీల వర్షం..

అసెంబ్లీ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రుణమాఫీ చేస్తామని పార్టీలు హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. దీంతో రైతులు రుణాలు మాఫీ అవుతాయనే భ్రమల్లో ఉంటున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ పార్టీ రూ.లక్ష వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. 2018లో కూడా టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రుణమాఫీ హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ పాక్షికంగానే రుణమాఫీ చేసింది. 2023లో అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ దిశగా అడుగులు వేయటం లేదు. ప్రభుత్వం రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తే ఎన్‌పీఏలోకి చేరిన రైతులకు ఒకింత ఊరట లభించే అవకాశం ఉంది.

బకాయిలు రూ.344 కోట్లకు పైగానే..

జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల్లో 44,350 మంది ఖాతాలు ఎన్‌పీఏలోకి చేరాయి. వీరు తీసుకున్న అప్పు రూ.344 కోట్లకు పైగానే ఉంది. ఇందులో రూ. 200 కోట్లకు పైగా పంటరుణాలు ఉండగా, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి రైతులు తీసుకున్న రుణాలు రూ.67 కోట్లు, చిరు వ్యాపారాల కోసం తీసుకున్న రుణాలు రూ.31 కోట్లతో పాటు ఇతర రుణాలు ఉన్నాయి. మాఫీ అవుతుందనే ఆశతో రైతులు బ్యాంకు రుణాలు చెల్లించకపోవడంతో వారి ఖాతాలు ఎన్‌పీఏలోకి చేరుతున్నాయి. దీంతో బ్యాంకుల్లో ఇకపై వారికి ఎలాంటి రుణాలు అందే అవకాశం ఉండదు.

అప్పు కట్టలేదని పింఛన్ ఆపేశారు

పెట్టుబడుల కోసం తీసుకున్న అప్పు కట్టలేదని ఆసరా పింఛన్ ఇవ్వకుండా బ్యాంకులో ఆపేశారు. కంటి ఆపరేషన్ చేయించుకుందామని పదినెలలుగా పింఛన్ డబ్బులు బ్యాంకులోనే ఉంచాను. బ్యాంకుకు వెళ్లి పింఛన్ అడిగితే లోన్ కడితేనే ఇస్తామన్నారు. రుణమాఫీ అవుతుందని నాలుగేళ్లుగా చూస్తున్నా. రుణమాఫీ కాలేదు. బ్యాంకు ఖాతాను ఎన్‌పీఏలో పెట్టింద్రు.

– బాదావత్ లోక్యా, రైతు, కృష్ణసాగర్

కనీసం వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి

రైతులు పంటల సాగుకు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. రుణమాఫీ ఆశతో రుణాలు చెల్లించకుండా ఉంచితే ఆ ఖాతాలు ఎన్‌పీఏలోకి చేరుతాయి. రైతులు తమ పంట రుణాలకు కనీసం వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. బ్యాంకు ఖాతా ఎన్‌పీఏలోకి వెళ్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు.

– రామిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక ఆల



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఆర్డీఓ విద్యాచందన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- వయోజన విద్యాశాఖలో పనిచేసిన సాక్షర భారత్ మండల, గ్రామ కో ఆర్డినేటర్లకు తిరిగి ఉద్యోగావకాశం కల్పించాలని పలువురు వినతిపత్రం అందించగా డీఈఓకు ఎండార్స్ చేశారు.
- పాల్వంచలోని జగ్గుతండాకు చెందిన వడ్డెర కులస్తులు అటవీప్రాంతంలో 70 ఏళ్లుగా పునాదిరాయి కొట్టుకుని జీవిస్తున్నామని, లంబాడాలు మేకలు పేపుకుంటూ జీవిస్తున్నారని, ఆ భూమిలో కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ట్రెంచ్ కొట్టించారని, సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందించగా కలెక్టరేట్ ఈ –సెక్షన్‌కు ఎండార్స్ చేశారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వైద్యారోగ్య, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 3న నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాలు ఉంటాయన్నారు. జిల్లాలో 97,522 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, అందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. 3వ తేదీన వేయలేని వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేయాలన్నారు. అన్ని శాఖలు సహకరించాలని అదేశించారు. డీఎంహెచ్‌ఓ శిరీష మాట్లాడుతూ.. జిల్లాలో 925 పోలియో కేంద్రాలు, 38 సంచార టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గోదావరి, కిన్నెరసాని నదుల సమీప మండలాల్లో నిర్వహిస్తున్న రీచ్‌లలో ఇసుక లభ్యత, నిల్వలపై సంయుక్త తనిఖీలు నిర్వహించాలని, శుక్రవారం నాటికి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యతను బట్టి కొత్త రీచ్‌ల ఏర్పాటుకు తగిన ప్రదేశాలను గుర్తించాలన్నారు. నిబంధనల మేరకే ర్యాంపుల నుంచి ఇసుక విక్రయించాలని సూచించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, ఇసుక రీచ్‌లకు చేరుకోవడానికి ఒకేదారి ఉండేలా ట్రెంచ్ ఏర్పాటు చేయాలని అన్నారు. రసీదు, దానిపై స్టాంప్ ఉన్న వాహనాలు మాత్రమే రీచ్‌లోకి అనుమతించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలకు జరిమానా విధించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ రెహమాన్, కలెక్టరేట్ ఏఓ గన్యా, ఇరిగేషన్ ఈఈ అర్జున్, మైన్స్ ఏడీ జైసింగ్, భూమి కొలతల అధికారి కుసుమకుమారి, భూగర్భ జల శాఖాధికారి బాలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

చంద్రుగొండ: సైన్స్‌ఫేర్‌ల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని డీఈఓ వెంకటేశ్వరాచారి అన్నారు. చంద్రుగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల ప్రధానోపాధ్యాయులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట హైస్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ, హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, తొలిఅడుగు నిర్వాహకులు రాము పాల్గొన్నారు.

'ఓపెన్' విద్యను సద్వినియోగం చేసుకోవాలి

పాల్వంచ : ఓపెన్ స్కూల్ విద్యతో బంగారు భవిష్యత్ ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ అన్నారు. స్థానిక స్టార్ చిల్డ్రన్స్ ఓపెన్ స్టడీ సెంటర్‌ను సోమవారం ఆయన ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెగ్యులర్ విద్యను అభ్యసించలేని వారు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్హతలను పెంచుకుని, బంగారు జీవితానికి బాటలు వేసుకోవాలని కోరారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్‌లో రెండో ర్యాంక్ సాధించిన గుమ్మళ్ల జయలేఖను అభినందించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ జి.భాస్కరావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, పి.పుష్పలత, రమాదేవి, స్వరూప, మహేశ్వరి, మౌనిక, ప్రశాంతి పాల్గొన్నారు.

భారజల కర్మాగారానికి స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు



అణుశక్తి విభాగం కార్యదర్శి మొహంతిని సన్మానిస్తున్న జీఎం, తదితరులు

అశ్వాపురం: అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారానికి 2022–23 ఏడాదికి గాను స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ముంబైలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భారత అణుశక్తి విభాగం కార్యదర్శి, అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి చేతుల మీదుగా స్పెషల్ అవార్డును భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, అణుశక్తి కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గద్దం రమేష్ అందుకున్నారు. అనంతరం చైర్మన్‌ను వారు సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం జగ్గారావు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ మణుగూరు భారజల కర్మాగారాన్ని అగ్రస్థానంలో కొనసాగించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, శ్రీనివాసరావు, రమేష్ మాట్లాడుతూ కర్మాగారానికి అవార్డు రావడంలో కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వం సన్నద్ధం



పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

- రేపటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు
- జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు
- అమలులో నిమిషం నిబంధన..
- జిల్లాలో మొత్తం విద్యార్థులు 19,477 మంది

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్‌మీడియెట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సన్నద్ధం చేశారు. ఈనెల 28 నుంచి పరీక్షలు జరుగుతుండగా జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రియాంక ఆల విద్య, రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో గత వారం సమావేశం నిర్వహించి దిశా, నిర్దేశం చేశారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే సెంటర్ల పరిధిలోని పోలీసు స్టేషన్లకు చేరుకున్నాయి. గతేడాది మొదటి సంవత్సర విద్యార్థులు 60 శాతం, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 74 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువగా నమోదవుతుందని కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందక వారు కొంతమేర ఇబ్బంది పడ్డారు.


పరీక్ష కేంద్రాల్లో సీసీ నిఘా..

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఉంచనున్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సర విద్యార్థులు 10, 200 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 9,277 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇక పరీక్షల నిర్వహణకు 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది శాఖాపరమైన అధికారులు, 13 మంది అదనపు పర్యవేక్షకులను ఏర్పాటుచేశారు. పరీక్ష సమయంలో సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు ఐదు కస్టోడియన్స్ పర్యవేక్షణ చేస్తారు. ఇప్పటికే 550 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని, పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

పటిష్ట ఏర్పాట్లు..

జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, అత్యవసర వైద్య సేవలతో పాటు అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. సమీప పీహెచ్‌సీల్లో అత్యవసర వైద్య సేవలకు వార్డులు ఏర్పాటు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ, మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఇతర డిపోల నుంచి బస్సులు తెప్పించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు, విధులు నిర్వహించే సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడానికి అనుమతి లేదని నోడల్ అధికారి తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కేంద్రంలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సందేహాల నివృత్తికి జూనియర్ అసిస్టెంట్లు బి.బిక్షం(9704661714), ఇ.శివకుమార్(9346913069)ను సంప్రదించాలని సూచించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలి. పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

– సులోచనారాణి, డీఐఈఓ

ఇంటర్ విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 28నుండి జరగనుండగా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేగా ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఉదయం 8గంటలకల్లా విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేగా సర్వీసులు నడిపించాలని డీఎంలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు బస్‌పాస్ ఇంటర్ విద్యార్థులు పాస్ రూట్‌తో సంబంధం లేకుండా హాల్‌టికెట్‌పై ఉన్న కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పాస్ కలిగిన విద్యార్థులు కాంబినేషన్ టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ఇక మహాలక్ష్మి పథకం ద్వారా విద్యార్థినులకు బస్‌పాస్ లేకున్నా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. ఈమేరకు ఇబ్బందులు ఎదురైతే సంప్రదించాల్సిన నంబర్లను ఆర్‌ఎం విడుదల చేశారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నంబర్ 99592 25979, పాత బస్టాండ్ 99592 25965, సత్తుపల్లి 99592 25990, మణుగూరు 89853 61796, కొత్తగూడెం 99592 25982, మధిర 73829 25289, భద్రాచలం 99592 25987, ఇల్లెందులో 99592 25984 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవ్

ప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే కూనంనేని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

కొత్తగూడెంరూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నమే బాలోత్సవ్ ఉద్దేశమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మూడు రోజుల పాటు సాగే వేడుకలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014లో మొదలుపెట్టిన బాలోత్సవ్ గత పదేళ్లుగా వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని, విద్యార్థులు చదువుతోపాటు కళా రంగంలోనూ రాణించాలని అన్నారు. ఒడుదుడుకులు ఎదురైనా క్రమం తప్పకుండా వేడుకలు నిర్వహిస్తున్న బాలోత్సవ్ కన్వీనర్ మద్దెల శివకుమార్‌ను అభినందించారు. అనంతరం చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పండుగలు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. ఈనెల 28 వరకు జరిగే బాలోత్సవ్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సింగరేణి రిటైర్డ్ జీఎం అనందరావు, సినీ గాయకులు అల్లి శంకర్, గుమలాపురం సత్యనారాయణ, సంగీత విద్వాంసుడు అలిపిరెడ్డి ఉదయభాస్కర్‌రెడ్డి, ధనరాజ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'ల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



దమ్మపేట సభలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

చుంచుపల్లి/దమ్మపేట : గత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో మూడోసారి మోదీ సర్కారే వస్తుందని అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయసంకల్ప యాత్రలో భాగంగా దమ్మపేటలో నిర్వహించిన బహిరంగ సభలో, కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నిరుద్యోగ భృతి గురించి నిలదీస్తే ఆ హామీ ఇవ్వలేదని అబద్ధాలు ఆడారని అన్నారు. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మరోసారి మాయమాటలకు తెరలేపిందని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీకి ప్రాతినిధ్యం లేకపోయినా కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, భద్రాచలం ఆలయం, కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారతదేశం వైపు చూస్తున్నాయంటే ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన దక్షతే కారణమన్నారు. అవినీతి, కుంభకోణాలకు తావులేకుండా అభివృద్ధి, సంక్షేమంతో కూడిన జనరంజక పాలన అందించిన మోదీనే మూడోసారి కూడా ప్రధాని అవుతారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్, నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, చాడ శ్రీనివాసరెడ్డి, జె.శ్రీకాంత్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజమౌళి, ఈవీ రమేష్, మేఘనాథ్, నరేంద్రబాబు, చింతలచెర్వు శ్రీనివాసరావు, వినోద్ రావు, గాదె రాంబాబు, వాసుదేవరరావు, ఉడతనేని విశ్వేశ్వరరావు, కోలికపోగు ముసలయ్య, గొట్టిపుల్ల దుర్గాశ్రీనివాస్, మడకం రవి, దారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిక్షణ పూర్తిచేసుకున్న దియా..



శిక్షణ పూర్తిచేసుకున్న జాగిలంతో ఎస్పీ రోహిత్‌రాజ్, సిబ్బంది

కొత్తగూడెంటౌన్: ఐఐటీఏ మొయినాబాద్‌లో ఎనిమిది నెలలపాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణను జిల్లాకు చెందిన పోలీసు జాగిలం దియా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్ దియాకు హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్న ఏ.ఆర్.కానిస్టేబుల్ మహేందర్, ఇతర డాగ్ స్క్వాడ్, అధికారులు, సిబ్బందిని అభినందించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పేలుడు పదార్థాలను కనుగొనడంలో దియా ప్రత్యేక శిక్షణ పొందిందని తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న 11 జాగిలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్ఐ రవి, ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల జోడో యాత్రను జయప్రదం చేయాలి

ఇల్లెందు: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కోసం ఈ నెల 28న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగే జోడో యాత్రను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆదూరి రవి కోరారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజలింగు, తిరుమలరావు, వెంకన్న, కోటయ్య, నరేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంటలో నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పనులకు గ్రామానికి చెందిన కేవీఆర్ ఫంక్షన్‌హాల్ అధినేత క్లాం వీరారెడ్డి కుమారుడు జన్నారెడ్డి సోమవారం రూ.1,01,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి కుటుంబసభ్యులకు మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కేసు నమోదు

ఇల్లెందు: చిన్నారిని బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 23న మండలంలోని బొజ్జాయిగూడెం వద్ద తొమ్మిదేళ్ల చిన్నారి బి.రిత్వికను మురళి అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో బాలికకు గాయాలు కాగా, కుటుంబ సభ్యులు చికిత్స అందించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడి ఘటనలో...

పాల్వంచరూరల్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసి సెల్‌ఫోన్‌ను అపహరించిన ముగ్గురు మహిళలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాల్వంచ వనమా కాలనీకి చెందిన కాజూలూరి మల్లేష్ మండల పరిధిలోని సీతానగర్‌కాలనీ సమీపంలో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో పనిచేస్తున్నాడు. గతంలో ఇంటి పక్కన ఉన్న ముగ్గురు మహిళలు ఈ నెల 10న వచ్చి మల్లేష్‌తో వాగ్వావాదానికి దిగారు. దాడి దాడి చేసి గాయపరిచారు. సెల్‌ఫోన్ అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన శారద, రోజా, దేవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని పెద్ద కమలాపురం గ్రామంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన రతన్ బిశ్వాల్ అనే వ్యక్తి నిల్వ చేసిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులు..

ఇల్లెందు: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన గుడిశాల చైతన్యకు తాళ్లపూసపల్లికి చెందిన అనిల్ కుమార్‌తో 2016లో వివాహం జరిగింది. కొంతకాలం పాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. కొద్దిరోజులుగా భర్త కట్నం కోసం వేధిస్తుండగా, చైతన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

ములకలపల్లి : పిల్లలు పుట్టి చనిపోతుండటంతో మనస్తాపం చెంది ఓ మహిళ ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మామిళ్లగూడెం శివారులో నివసించే వలస ఆదివాసీలు అడమ, లక్మలకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు శిశువులు జన్మించి, చనిపోయారు. ఈక్రమంలో కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్న అడమ ఆదివారం పురుగుల మందు తాగింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

ఉచిత్ విద్యుత్ అందేనా?

- ఇల్లెందు 21పిట్ ఏరియాలో 271 కుటుంబాల ఆందోళన
- గత్యంతరం లేక సింగరేణి విద్యుత్‌తో సర్దుబాటు
- ఫలితంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి దూరం



వందేళ్ల నాటి 21 పిట్ ఏరియా కార్మిక వాడ

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలోని 21 పిట్ ఏరియా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ ఉచిత్ విద్యుత్ అందే పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటివరకు సింగరేణి సంస్థ ద్వారా సరఫరా అవుతున్న ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగించుకుంటున్నారు. దీంతో 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ పొందలేకపోతున్నారు. ఇల్లెందులో ఏర్పడిన మొదట భూగర్భ బొగ్గు గని 21 పిట్. ఆ గని పేరుతోనే వందేళ్ల క్రితం కార్మిక వాడ ఏర్పడింది. కార్మికులు ఉద్యోగ విరమణ పొందాక అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అరకొర వేతనం, రిటైర్డ్ అయ్యాక పెన్షన్ కూడా అంతంతే రావడంతో శిథిలమైన క్వార్టర్లలోనే ఉంటున్నారు. తొలుత కార్మికవాడకు పారిశుద్ధ్య పనులు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలను సింగరేణి సంస్థ సమకూర్చింది. కార్మికుల సంఖ్య తగ్గడంతో ఉన్న కొద్ది మందినీ ఇతర కాలనీకి మార్చింది. అప్పటి నుంచి తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించింది. తరచూ విద్యుత్ కోత విధించేది.

ఇప్పటివరకు సింగరేణి ఇండస్ట్రియల్ కరెంట్ వినియోగం..

సింగరేణి సంస్థ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమం చేపట్టారు. దీంతో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాకు అంగీకరించిన యాజమాన్యం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయలేమని చెప్పింది. రాష్ట్ర తొలి స్పీకర్ మధుసూదనాచారి చొరవతో పరిరక్షణ కమిటీ సింగరేణి సీఎండీని కలిసి సమస్యను వివరించింది. ఈ క్రమంలో సింగరేణి అంగీకారంతో విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కో ముందుకువచ్చింది. అధికారులు సర్వే నిర్వహించి క్వార్టర్లకు ప్రభుత్వ విద్యుత్ ఇచ్చేందుకు రూ.18లక్షలు ఖర్చవుతాయని తెలిపా రు. నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. దీంతో చివరకు పరిరక్షణ కమిటీ సింగరేణి సంస్థతో రాజీ కుదుర్చుని ప్రతి ఇంటికి ప్రైవేటు మీటర్లను అమర్చేందుకు అంగీకరించింది. అప్పటినుంచి యూనిట్‌కు రూ.6.45 చొప్పున చెల్లిస్తూ విద్యుత్ వినియోగించుకుంటున్నారు. కనీస విద్యుత్ చార్జీ రూ.150 చెల్లిస్తున్నారు. దీంతో ఒక్కో ఇంటికి రూ. వెయ్యి వరకు బిల్లు వస్తున్నా చెల్లించక తప్పడంలేదు. వంద యూనిట్లకు తక్కువే వినియోగిస్తున్నా బిల్లు మాత్రం రూ.600కు పైగానే చెల్లించాల్సి వస్తోంది.

అర్హత కోల్పోతున్న 271 కుటుంబాలు

తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు గృహాలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తామని ప్రకటించింది. కానీ 21పిట్ ఏరియాలోని 271 మంది కుటుంబాలు అంతకంటే తక్కువగానే విద్యుత్‌ను వినియోగిస్తున్నా ఉచిత పథకానికి నోచుకోలేకపోతున్నారు. సింగరేణి సంస్థ ద్వారా సరఫరా అవుతున్న ఇండస్ట్రియల్ కరెంటును వినియోగించడం వల్లే ఈ పరిస్థితి ఎదురైంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఉచిత విద్యుత్ వర్తించేలా చూడాలని 21 పిట్ ఏరియా ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికభారమైనా..



పరిరక్షణ కమిటీ ద్వారా మీటర్ ఏర్పాటు చేసిన కొత్తలో విద్యుత్ బిల్లు రూ.వెయ్యికి పైగా చెల్లించాం. అది ఆర్థికంగా భారం కావడంతో అవసరమైతే తప్ప బల్బు వేయడం లేదు. పొదుపుగా వాడుకుంటున్నా విద్యుత్‌బిల్లు రూ.600కు పైగా చెల్లించక తప్పడం లేదు.

–బొమ్మ మాధవి, గృహిణి, 21పిట్ ఏరియా

ప్రభుత్వ విద్యుత్ సమకూర్చాలి



21పిట్ ఏరియా సింగరేణి పాత క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారంతా నిరుపేదలే. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సింగరేణి సంస్థ విద్యుత్ బిల్లులు భారంగా మారాయి. ప్రభుత్వం స్పందించి ఉచిత్ విద్యుత్ సమకూర్చాలి.

–వడ్ల శ్రీనివాస్, 21 పిట్ ఏరియా

సింగరేణి విద్యుత్ వాడడం వల్లే..



21పిట్ ఏరియా పరిధిలోని సింగరేణి క్వార్టర్లకు ఆ సంస్థ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఈ కారణంగా వారంతా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకానికి అనర్హులయ్యారు. గతంలో ప్రభుత్వ విద్యుత్‌ను వినియోగించుకుంటే అర్హులయ్యేవారు.

– కోటేశ్వరరావు, ఏడీఈ, ఇల్లెందు సబ్‌డివిజన్

ఢిల్లీ రైతు ఉద్యమానికి అండగా నిలవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. దేశ రాజధానిలో రైతులు నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతుగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ గతంలో ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకుంటున్నట్లు హామీ ఇచ్చిన కేంద్రం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేయలేదని విమర్శించారు. రైతు ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు నష్టపరిహారం విషయంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. పండించిన పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని, ఇందుకోసం కమిటీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కొత్త వ్యవసాయ చట్టాలు పెట్టుబడిదారులను మరింత కుబేరులుగా మార్చే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల నర్సయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ సలీం, కె.సారయ్య, రావులపల్లి రవికుమార్, వై భాస్కర్‌రావు, దేవరకొండ శంకర్, వి పూర్ణచందర్‌రావు, మల్లిఖార్జున్, కంచర్ల జమలయ్య, పద్మజ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ హవేలీ – సంగెం రహదారిలో మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందాడు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీజవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనికుంటకు చెందిన చల్ల శ్రీనివాస్(32) తన భార్య భవానితో కలిసి ఆదివారం సంగెం మండలం చింతలపెల్లిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఊకల్‌హవేలి శివారు మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి, ఫెన్సింగ్ కోసం పాతిన రాయికి ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులిద్దరికీ గాయాలయ్యాయి. 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు.

ఎర్రగుంట ఆర్వోబీ ప్రారంభం



శిలాఫలకాలను ప్రారంభిస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట సమీపంలో నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జ్(ఆర్‌ఓబీ)ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రాచలం రోడ్డు నుంచి సత్తుపల్లి వరకు నిర్మించిన రైల్వే లైన్‌లో చంద్రుగొండ- పార్థసారథిపురం రైల్వేస్టేషన్ మధ్య విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై ఎర్రగుంట సమీపంలో రూ.93 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జిని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించగా, ఇక్కడ శిలాఫలకాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఓబీతో రవాణాకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు రజినీస్‌కుమార్ మీనా, జేమ్స్‌పాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, కొవ్వూరు రైల్వే సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగాచార్యులు, ఎంపీఓ షాబ్నా, మెడికల్ ఆఫీసర్ డా.ప్రియాంక, నాయకులు వేముల రమణ, వేముల నరేష్, పర్సా వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి లక్ష్మణరావు, రాము, లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రైల్వేసిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

డ్రైవర్ మృతి, క్లీనర్ పరిస్థితి విషమం



గట్టుగూడెంలో చెట్టును ఢీకొట్టిన లారీ

దమ్మపేట: అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొని డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మండలంలోని గట్టుగూడెం గ్రామంలో రాష్ట్రీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పాత ఇనుము లోడు లారీ వైజాగ్ నుంచి సత్తుపల్లి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో గట్టుగూడెం గ్రామ సమీపంలోని పల్లం రోడ్డులో ఒక్కసారిగా అదుపుతప్పి ఢీకొని బోల్తా కొట్టింది. దొర్లుకుంటూ వెళ్లి చెట్టును ఢీకొట్టింది. చెట్టు కేబిన్‌లో ఇరుక్కుపోగా లారీ డ్రైవర్ ఎండీ అర్బాజ్(25) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ ఎండీ జునాయిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతికష్టం మీద క్లీనర్‌ను బయటకు తీసి, అంబులెన్స్‌లో అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి హెచ్చరించారు.

పట్టపగలే అపార్ట్‌మెంట్‌లో చోరీ

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. స్థానిక భగత్‌సింగ్ సెంటర్‌లో ఉన్న ఆళ్ల అంజయ్య అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లో విజయ్ కృష్ణ నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం ఫ్లాట్‌కు తాళం వేసి భార్యతో కలిసి మార్కెట్‌కు వెళ్లాడు. అరగంటలో తిరిగి వచ్చేసరికి వెనుక వైపు ఉన్న తాళం ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి నాలుగు కాసుల బంగారు హారం, రెండు ఉంగరాలతోపాటు రూ.28వేల నగదు అపహరించారు. అపహరణకు గురైన బంగారు ఆభరాణాల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీ ఘటన జరిగిన అపార్ట్‌మెంట్ కింద భాగంలోనే యూనియన్ బ్యాంకు సైతం ఉండగా, పట్టపగలే దుండగులు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో చోరీకి పాల్పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

- ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్
- గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఇంటర్‌మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున గిరిజన సంక్షేమ గురుకులాల్లోని విద్యార్థులను సిద్ధం చేయాలని ఐటీడీఏ ఏపీఏ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించాక యూనిట్ అధికారులకు అందచేసి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఈ సమయంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ బలవర్ధకమైన ఆహారం అందజేయాలని తెలిపారు.

సమస్యలపై వినతుల వెల్లువ

గిరజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల గిరిజనులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అశ్వారావుపేట మండలం వినాయకపురానికి చెందిన ముత్తయ్య బోరు బావు తవ్వించి మోటార్ ఇప్పించాలని, ఆళ్లపల్లి మండలానికి రైతులు తమ పంట పొలాల్లో వరదల కారణంగా ఇసుకమేటలు తొలగించాలని కోరారు. అలాగే, ఆళ్లపల్లి మండలం రాయపురానికి చెందిన గిరిజనులు తేనెటీగల పెంపకానికి రుణ సదుపాయం కల్పించాలని, అశ్వరావుపేట మండలం మామిళ్లగూడెంకు చెందిన 38 మంది గిరిజనులు పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. గిరిజన దర్బార్ 150కి పైగా అర్జీలు అందగా, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని ఏపీఓ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తానాజీ, సురేష్‌బాబు, భాస్కర్, మునీర్‌పాషా, శ్రీనివాస్, నారాయణరావు, ప్రభాకర్‌రావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నీలో కేటీపీఎస్ జట్టు ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో ఈనెల 18నుండి 25వ తేదీ వరకు నిర్వహించిన ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ జట్టు ప్రతిభ కనబర్చింది. సింగరేణి కాలరీస్, నవభారత్, కేటీపీఎస్ 5, 6, 7వ దశలు, బీటీపీఎస్, ఐటీసీ, హెవీ వాటర్ ప్లాంట్ జట్లు తలపడగా ఏడో దశ జట్టు రెండో స్థానం నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం టీం కెప్టెన్ ఎం.డీ.ఆరీఫ్, క్రీడాకారులు సీఈ పి.వెంకటేశ్వరరావును కలవగా ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో డీఈ ఎస్ఎస్ఎస్.శేఖర్‌తో పాటు వై.వెంకటేశ్వర్లు, ఎస్ఎల్‌కే.ప్రసాద్, జట్టు సభ్యులు ఎం.శ్రీనివాస్, డి.రమేశ్, కె.నర్సింహారావు,టి.మహేశ్, కె.వివేక్, ఎం.లింగనాయక్, జి.లక్ష్మణ్‌రావు, ఎం.డీ.ముక్తార్ అహ్మద్, ఎస్.భానుమహేశ్, టి.రమేశ్, పి.శ్రీనివాస్, కె.రాహుల్, డి.భరత్‌కుమార్, పి.సతీశ్ కుమార్, డి.మహేశ్ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



వైస్ ఎంపీపీపై అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న ఎంపీటీసీలు

అశ్వాపురం: అశ్వాపురం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ వీరభద్రంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు, టీడీపీకి చెందిన ఒక ఎంపీటీసీ గత నెల 30న భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్‌కు అవిశ్వాసం తీర్మానం నోటీసు అందజేశారు. భద్రాచలం ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ సుమ ఆధ్వర్యంలో సోమవారం అశ్వాపురం రైతువేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీటీసీలు, కమటం నరేష్, బేతం రామకృష్ణ, కొర్సా చినముత్తయ్య, ఏనిక రవి, కొమరం చిట్టిమ్మ, గాదె జయ, ఎంపీపీ ముత్తినేని సుజాత, టీడీపీకి చెందిన తుక్కారి గంగాభవాని సమావేశానికి హాజరుకాగా కోరం పూర్తయింది. అధికారులు ఓటింగ్ నిర్వహించగా, హాజరైన ఎనిమిది మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లు ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ సుమ ప్రకటించారు. కాగా చివరలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన తుమ్మలచెరువు ఎంపీటీసీ తాటి పూజిత సమావేశానికి హాజరవడం చర్చనీయాంశంగా మారింది. అప్పటికే అవిశ్వాసంపై ఓటింగ్ పూర్తయింది. నెగ్గిన అవిశ్వాస తీర్మానాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపించి తదుపరి ఉత్తర్వులు వచ్చాక వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పామాయిల్ గెలల రవాణా

దమ్మపేట: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పరిధిలోని రైతుల పామాయిల్ గెలలను నిబంధనలకు విరుద్ధంగా, సమీప ఆంధ్ర ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం ఆయిల్ ఫెడ్ సిబ్బంది అడ్డుకున్నారు. తిరిగి అశ్వారావుపేట ఫ్యాక్టరీకి పంపారు. సత్తుపల్లి మండలంలోని మేడిశెట్టివారిపాలెం, దమ్మపేట మండలంలోని అల్లిపల్లి, ముష్టిబండ, మందలపల్లి గ్రామాల్లో నాలుగు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ మాట్లాడుతూ గెలలను ఏపీకి తరలిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

కొత్తగూడెం రూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ గ్రామ పంచాయతీలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఫారెస్ట్ సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారులను గమనించి డ్రైవర్ టిప్పర్‌ను వదిలి పరారయ్యాడని, దీంతో సెంట్రల్ పార్క్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ సురేశ్ తెలిపారు.

పెద్దనల్లబల్లిలో జేసీబీ..

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో అక్రమ మట్టి తోలకాలకు వినియోగిస్తున్న జేసీబీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుండగా ఆర్ఐ లక్ష్మయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం గ్రామపంచాయతీ సమీపంలో ఇల్లెందు–గుండాల ప్రధాన రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పూసపల్లి గ్రామానికి చెందిన మంచాల చందన్, లింగాల ప్రణయ్ ఇద్దరు బైక్‌పై మామిడిగూడెం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే టెలికమ్యూనికేషన్ కేబుల్ పరిచేందుకు తవ్విన కందకంలో పడిపోయారు. తీవ్ర గాయాలు కాగా, ఇద్దరిని 108 ద్వారా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మానికి సిఫారసు చేశారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

యువకుడు మృతి

టేకులపల్లి: మండలంలోని రేగులతండాకు చెందిన జాటోతు శ్రీనివాస్(25), తన మిత్రుడు భూక్య రాముతో కలిసి ఆదివారం రాత్రి ఏపీలోని ఎటపాకకు బయల్దేరారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అర్ధరాత్రి వేళ ఎటపాక ఠాణా సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలు కాగా, భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు తెలపగా, రాము చికిత్స పొందుతున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, మూడు నెలల పాప ఉన్నారు.

పాము కాటుతో దుక్కిటెద్దులు మృతి

గుండాల: పాముకాటుతో సోమవారం రెండు దుక్కి టెద్దులు మృతి చెందాయి. ఆళ్ళపల్లి మండలం మర్కోడు ఎస్సీ కాలనీకి చెందిన కరకపల్లి నాగేశ్వరరావు అనే రైతుకు మూడు పశువులు ఉండగా గత శుక్రవారం తెల్లవారుజామున ఒక గిత్త మృతిచెందింది. కాగా రెండు రోజుల వ్యవధిలోనే సోమవారం తెల్ల వారుజామున రెండు దుక్కిటెద్దులు పొలం వద్ద పాము కాటుతో మృతి చెందాయి. మృతి చెందిన పశువులకు ఆర్ఐ కంటి రమేష్ పంచనామా నిర్వహించారు. రూ.1.20 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.